క్లుప్తంగా

కంటి శస్త్రచికిత్సకు 45 మంది



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కుప్పం: సాయిమాత సేవాట్రస్టు, జిల్లా అంధత్వ నివారణ సంస్థలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 45 మందికి కేటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. బెంగళూరుకు చెందిన శంకర నేత్రాలయ వైద్యులు స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో 180 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ తెలిపారు. ఇందులో శస్త్రచికిత్సకు ఎంపిక చేసిన 45 మందికి బెంగళూరులోని శంకర నేత్రాలయలో ఉచితంగా చేస్తారని ఆయన చెప్పారు.

రోడ్డును బాగుచేయరూ!



గుంతలు తేలిన రోడ్డు

రామకుప్పం: రామకుప్పం నుంచి కెంపసముద్రం మీదుగా వి.కోట వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గుంతలు తేలిన రోడ్డు బురదమయమైంది. దీంతో ఈ మార్గంలో వాహనదారులు ప్రయాణం చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి వ్యవసాయోత్పత్తులను వి.కోట మార్కెట్‌కు తరలించడానికి ప్రధాన మార్గంగా ఉన్న ఈరోడ్డు దెబ్బతినడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ స్థాపన



ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం

పుంగనూరు: మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం వేదపండితులు పూజలు చేసి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు రామనామస్మరణతో ఆ ప్రాంతం భక్తిపారవశ్యమైంది. గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుస్తక పఠనంతోనే జ్ఞానం



ప్రచారం నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

కుప్పంరూరల్: పుస్తక పఠనంతోనే జ్ఞానం సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం ఆ సేవా సమితి ఆధ్వర్యంలో రామకుప్పం మండలంలోని పల్లికుప్పం, పంద్యాలమడుగు, తాండా, చిన్నగరికేపల్లి, పెద్దగరికేపల్లిలో ప్రబోధానంద రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. కృష్ణమూర్తి, శరవణ, కృష్ణ, రంగప్ప, దేవరాజు, ఇందిర, విమల పాల్గొన్నారు.

పలమనేరులో నిఘా ముమ్మరం



డీఎస్పీకి లైటింగ్ బల్బులను అందజేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

పలమనేరు: పట్టణంలో పోలీస్ నిఘా ముమ్మరం చేస్తున్నట్టు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఆమేరకు ఇక్కడి ట్రాఫిక్, బ్లూకోట్స్ సిబ్బందికి అవసరమైన లైటింగ్ లైట్లు, సామగ్రిని స్థానిక డీఎస్పీ ప్రభాకర్‌కు ఆదివారం పంపిణీ చేశారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చొరవచూపుతామన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం ఇద్దరి అరెస్ట్

పుంగనూరు: కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జవహర్‌బాబుతో కలసి ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో పట్టణంలోని ప్రకాశంకాలనీకి చెందిన కె.శ్రీనివాసులును నుంచి 88 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. బండ్లపల్లికి చెందిన మంజునాథ్‌రెడ్డి నుంచి 11 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఎదుగు లేని బతుకు!

- యానాదుల బతుకుల్లో వెలుగులు ఎక్కడ?
- గుడారాలే దిక్కు
- ఆధార్, రేషన్ కార్డులు లేవు
- కనీస వసతులు కరువు
- పట్టించుకోని అధికారులు



నెట్టిబండలో గుడారం ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న యానాదులు



నెట్టిబండలో యానాదులు నివాసమున్న గుడారాలు

చౌడేపల్లె: దశాబ్దాలు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారినా యానాదుల బతుకుల్లో వెలుగులేక మార్పురాలేదు. వారి సంక్షేమం కోసం పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా హంగులు, ఆర్భాటాలే తప్ప కిందస్థాయిలో వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆధునిక యుగంలో టార్పాలిన్ పట్టలు, బోద, జంబులతో ఏర్పాటుచేసుకున్న గుడారాలే దిక్కుగా మారి బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నారు. అటవీ ప్రాంతాలకు వెళ్లి పండ్లు, ఔషధ వస్తువులు విక్రయించి వాటితో వచ్చే సంపాదన ద్వారా జీవనం కొనసాగిస్తున్నారు. గుడారాల్లో బిక్కు బిక్కుమంటూ చీకటిలో బతుకుతున్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మార్గం చూపలేక వారి వెంటే అడవుల్లో గడుపుతున్నారు. తమ కష్టాలు తీర్చాలని పాలకులకు, అధికారులకు తెలిపినా వారిపై దయ చూపకపోవడం గమనార్హం.

మండలంలోని దిగువపల్లె పంచాయతీ నెట్టిబండ (గట్టువారిపల్లె)లో యానాదుల దీన గాథ. ఈగ్రామంలో 20 కుటుంబాలు నివశిస్తున్నాయి. ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలంటే ప్రధానంగా ఆధార్ కార్డు, రేషన్ కార్డులుండాలి. వీరిలో ఒకరిద్దరికి తప్ప పెద్ద, చిన్న పిల్లలు తేడా లేకుండా ఆధార్ కార్డులు లేవు. ఏడు పదుల వయస్సు ఉన్నా ప్రభుత్వం నెలా నెలా పంపిణీ చేసే పింఛన్లకు కూడా నోచుకోలేదు. పిల్లలు, స్కూళ్లకు వెళ్లకపోగా గర్భిణులు, బాలింతలకు సేవలు అందడంలేదని ఆరోపించారు. నివాసం లేక గుడారాల్లో ఉన్నారు. తాగడానికి నీళ్ల సమీపంలోని గుంతలో నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ట్యాంక్ నిర్మించినా పైప్‌లైన్ వేయకపోవడంతో సమస్య తీరకపోవడంతో గుంతల్లోని నీళ్లే దిక్కుగా మారాయి. వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో బయటకు రావడానికి సైతం భయపడే పరిస్థితి నెలకొంది. మండలంలోని గడ్డంవారిపల్లె రోడ్డు యానాది కాలనీ, రామయ్యగట్లు, పులికోన వంక, బోయకొండ యానాదిపాళ్యం, తామరాకుల కుంట ప్రాంతంలో వంద కుటుంబాలు నివశిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గత ప్రభుత్వాలు మంజూరు చేసిన ఇళ్లు పూర్తి కాక అసంపూర్తిగా నిలిచాయి. కాలనీల్లో కనీస వసతులు లేవు. రేషన్, ఆధార్ కార్డులు సైతం లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని పలుమార్లు కార్యాలయాల వద్దకు తిరిగినా తమపై అధికారులు దయచూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలున్నా స్వయం సహాయ సంఘాలు సైతం లేకపోవడం గమనార్హం. ఇకనైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని సమస్యలను పరిష్కరించాలని యానాదులు కోరుతున్నారు.



తాగునీటిని గుంతలో నుంచి తెచ్చుకుంటున్న యానాదులు

ఒకే గుడారంలో ఉంటున్నాం..



మా ఇంట్లో పెద్దలు, పిల్లలు కలిసి 13 మంది ఉంటున్నాం. అందరం ఒకే గుడారంలో ఉండడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. ఆధార్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తుచేసుకున్నాం. అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందేలా చూడాలి.

–రాజేశ్వరి, నెట్టిబండ, చౌడేపల్లె

మాకు ఆధార్ కార్డుల్లేవ్..



మాఇంట్లో పెద్దోళ్లు, పిల్లోల్లు ఎవరికీ ఆధార్ కార్డుల్లేవ్. ఎక్కడ ఇస్తారో తెలియదు. ఆఫీసు వద్దకు వెళితే వాళ్లు ఏదేదో సర్టిఫికెట్లు కావాలని అడుగుతున్నారు. మేము చదువుకోలేదు. ఎలా చేసుకోవాలో తెలియదు. మాపై కనికరించి కార్డులన్నీ వచ్చేలా చూడాలి.

–సిద్ధమ్మ, నెట్టిబండ, చౌడేపల్లె

మాకు సాయం చేయండి..



అన్ని అర్హతలు ఉన్నాయి. ప్రభుత్వం ఎస్టీల శ్రేయస్సు కోసం అమలుచేసే పథకాల్లో లబ్ధిపొందడానికి పాలకులు, అధికారులు సాయం చేయాలి. అందరికీ కార్డులు ఇచ్చి ఇళ్లు, నీటి సౌకర్యాలు కల్పించాలి.

–గంగులమ్మ, నెట్టిబండ, చౌడేపల్లె



కనెక్షన్ లేక నిరుపయోగంగా ట్యాంకు

వివాహ వేడుకల్లో జెడ్పీ చైర్మన్



వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్

గుడుపల్లె: పుణ్యక్షేత్రమైన గుడివంక ఆలయ పూజారి వీరశేఖరయ్య కుమారుడు చేతన్, ఆదిత్యల పెళ్లికి హాజరైన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వధూవరులను ఆశీర్వదించారు. ఆదివారం గుడివంక ఆలయంలో ఈ వివాహ వేడుక జరిగింది. జెడ్పీటీసీ సభ్యులు కృష్ణమూర్తితో కలసి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పూజలు



ఇరుముడులతో అయ్యప్ప భక్తులు

వి.కోట: పట్టణంలోని ముదిమడుగు గ్రామంలో ఆదివారం అయ్యప్ప భక్తులు భజనలుచేసి, ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడు, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాలను అరటి బొద్దెలతో, రంగురంగుల పుష్పాలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మాల ధరించిన స్వాములు, గురుస్వాములు భజనలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారణ ధరించిన స్వాములు ఇరుముడులు కట్టి శబరిమలై అయ్యస్వామి కొండకు బయలుదేరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



ఉత్తమ కవులను సత్కరిస్తున్న నిర్వాహకులు

వి.కోట: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కళాభారతి ఫౌండేషన్ అధ్యక్షుడు రఘుపతి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన కవులు వారి కవితలను విన్నవించి కవిత గానం చేశారు. ఉత్తమ కవులకు గ్రంథాలయ నిర్వాహకులు మెమెంటోలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. కవులు డాక్టర్ కఠారి వెంకటరత్నం, డా.శాంతకుమారి, డా.రఘుపతి, శివరాం, హరికృష్ణారెడ్డి, రవింద్రబాబు, సిద్ధారెడ్డి, నేతలు రంగనాథ్, సిబ్బంది మహ్మద్ వహాబ్ పాల్గొన్నారు.

ఆగని గజ దాడులు

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. గత కొంత కాలంగా పెద్దకాప్పల్లి పంచాయతీ పరిధిలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లి, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లి, జిట్టంవారిపల్లి, పెనుగొలకల, పెద్దకాప్పల్లి, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లి రైతులకు చెందిన పంటలను నాశనం చేస్తున్నాయి. రోజూ ఏదో ఒక గ్రామంలో పంటలపై దాడి చేసి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరుస దాడులతో అన్నదాతలకు కన్నీళ్లు మిగులుస్తున్నాయి. శనివారం రాత్రి తాజాగా పుంగనూరు ఫారెస్టు రేంజ్ పేటూరు బీటు నుంచి వచ్చిన ఏనుగులు కొత్తబూరగపల్లి సమీపంలోని పంటలపై విధ్వంసం సృష్టించాయి. ఈశ్వరమ్మ, రెడ్డిప్రసాద్‌కు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంట నష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

వేడుకగా కార్తీక వనభోజనం



కార్తీక వన భోజనాల కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబాలు

పలమనేరు: పట్టణంలోని పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కార్యక్రమం గజారామంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉసిరివనంలో పూజలు చేశారు. కుటుంబాల సమేతంగా ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



బహుమతులు పొందిన విద్యార్థులతో ట్రస్టు నిర్వాహకులు, అతిథులు

శాంతిపురం: గ్రేస్ మేరియా చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కరేగానూరు వద్ద ఉన్న సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 15 గ్రామాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టీ ఆరోగ్యరాజు, సెక్రటరీ జేసుమేరీ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నామన్నారు. ఎంపిక చేసిన 15 గ్రామాల్లో సిబ్బందిని నియమించుకుని వేర్వేరు పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కుప్పం లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్, మౌంట్‌ఫోర్ట్ స్కూల్ ప్రిన్సిపల్ అనిల్‌రెడ్డి, పేద విద్యార్థులకు ట్రస్టు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్, విజర్ ఐవీఎఫ్ సెంటర్ పలమనేరు సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో డాక్టర్లు శివ, సరళ, కలీలుల్లా, అంజుమున్నిసా కలసి పిల్లలు పుట్టనివారికి పరీక్షలు నిర్వహించి, వైద్య సేవలు అందించారు. అలాగే కన్ను, ముక్కు, చెవి సమస్యలు ఉన్న వారికి చికిత్స అందించారు. శిబిరంలో 130 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. క్లబ్ ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, బాలసుబ్రమణ్యం, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. అదేవిధంగా సింగిరిగుంట గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ లీలా మాధవి, తహసీల్దార్ రాము ప్రారంభించారు. ఆదివారం తిరుపతి రమాదేవి సూపర్‌స్పెషాలిటీ వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని గ్రామంలో నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది.

చెరువు కోసం ఊరు ఏకమై..

- చెరువులో వ్యర్థాలను వేయరాదంటూ సూచిక బోర్డు
- చెరువులోని తాగునీటి బోరుకు ప్రహరీ ఏర్పాటు
- చెరువులో మట్టి తోడడం, వ్యర్థాలను వేస్తున్న వైనం
- వ్యర్థాలను వేయకుండా గ్రామస్తుల పహారా



చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

పలమనేరు: ఎవరోవస్తారని ఏమో చేస్తారని ఎదురుచూడకు నేస్తామా అంటూ తమ గ్రామానికి చెందిన చెరువు నాశనం అయిపోతుంటే చూసి తట్టుకోలేని గ్రామస్తులు చందాలు వేసుకొని చెరువు బాగోగులు చూస్తున్న సంఘటన ఆదివారం పలమనేరు మండలంలోని టి.వడ్డూరులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. పలమనేరు పట్టణానికి ఆనుకొని ఈ చెరువు ఉంది. ఈ చెరువు కింద 400 ఎకరాల ఆయకట్టు వందలాది మంది రైతుల పొలాలున్నాయి. ఇలాఉండగా ఈ చెరువులోకి వర్షపు నీరు రావడం లేదు. ఇందుకు కారణం పట్టణంలోని వ్యర్థాలను కొందరు ఈ చెరువులో పడేస్తున్నారు. దీంతోపాటు పట్టణంలోని వెంచర్లకు ఇక్కడి నుంచే మట్టిని తోడి తీసుకెళ్తున్నారు. దీంతో వర్షాలకు సైతం చెరువులో నీరు చేరకుండా పోయింది. మరోవైపు ఇదే చెరువులో మూడువేల మందికి అవసరమైన మంచినీటి బోరు ఉంది. దీనిపై సైతం వ్యర్థాలను పడేశారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఎవరో వస్తారని ఏమో చేస్తారని భావించని బేరుపల్లి, టి.వడ్డూరు గ్రామస్తులు రూ.1.20లక్షల దాకా చందాలేసుకొని చెరువులోని మంచినీటి బోరు వద్ద వ్యర్థాలు వేయకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అంతేకాకుండా ఆ చెరువులో ఎవరైనా ఇకపై వ్యర్థాలను పడేస్తే పంచాయతీ ద్వారా కేసులు తప్పవని ఓ హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఎవరైనా చెరువులో మట్టిని తవ్వినా లేదా వ్యర్థాలను పడేసినా దాన్ని గమనించి నివారించేందుకు కొందరు మనుషులను పహారాగా ఏర్పాటు చేసి చెరువు రక్షణకు నడుంబిగించారు. దీన్ని గమనించిన పలు గ్రామాల ప్రజలు మన చెరువుల బాగు కోసం మనం కూడా ముందుకెళ్లాలని వీరి స్ఫూర్తితో ముందుకెళుతున్నారు.



తాగునీటి బోరుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



వ్యర్థాలతో నిండిపోయిన బేరుపల్లి చెరువు

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



కవులు, రచయితలకు సన్మానం

పలమనేరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 15మంది కవులు, రచయితలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పలమనేరు రచయితల సంఘ అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ సమాజంలో మంచిని తీసుకురావడంలో రచయితల పాత్ర ఘనమైందన్నారు. భావితరాలను సన్మార్గంలో తీసుకెళ్లడంలో మన పాత్ర ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. మరోవైపు పలువురు విద్యార్థులు కవితలు చదివి వినిపించారు. ఇందులో గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దపంజాణి: విద్యనభ్యసించిన 12 ఏళ్ల తరువాత మిత్రులంతా ఒక్కటయ్యారు. ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ అనిర్వచనీయమైన అనుభూతులకు రాయలపేట కేవీసీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. 2011–12లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. అనంతరం స్నేహబంధం గుర్తుండేలా ఫొటోలు దిగారు. చివరగా అంతా కలసి సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు.